

సూర్య

www.suryaa.com

మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

శుక్రవారం 23 జనవరి 2026 పేజీలు 8


# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

## - జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్‌నగర్, సూర్య ప్రతినిధి:** జిల్లాలోని మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీలలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగరకర్నూలు, నారాయణపేట జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు తెలిపారు. ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా మ్యాపింగ్ చేసి ప్రచురించడం జరిగిందని తెలిపారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఒక రౌండ్ పరిశీలించినట్లు తెలిపారు. ఆర్.ఓ ఏ.ఆర్.ఓలను గుర్తించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ నిర్వహణకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉన్నట్లు, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ నిర్వహణకు పాలమూరు యూనివర్సిటీలో భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్.ఎస్.టి బృందాలకు మెజిస్టీ రీయల్ అధికారాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కాగా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్యన్యూస్:** ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను హాజరయ్యారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని సంబంధిత విభాగం అధికారులు ఎస్సీ ఎస్టీ కేసులలో బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో పాల్గొన్న డిఎస్పి నల్లపు లింగయ్య 2023లో 31, 2024 లో 34, 2025లో 24 ఎస్సీ ఎస్టీ కేసులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదు అయ్యాయని, 2025లో నమోదైన కేసులలో 4 కేసులు భూ సమస్యల పరిష్కారం కోసమే పెట్టారని తెలిపారు. మరో 2 కేసులకు చార్జిషీట్ వేయడం జరిగిందని, మరో 3 కేసులకు సంబంధించి డాక్యుమెంట్స్ రావాల్సిఉందని, ఒకకేసు మైనర్‌కు సంబంధించినదిగా డీఎస్పీ వివరించారు. ఆయా కేసులలో ఎఫ్.ఐ.ఆర్ కానీ చార్జిషీట్ కానీ, డీసీఆర్‌బి నుంచి అవుతాయని చెప్పారు. 2024 లో జరిగిన ఓ హత్య కేసు గురించి కలెక్టర్ ఆరా తీయగా, ఆకేసులో మద్యం మత్తులో ఓ వ్యక్తి కొట్టడంతో అవతలి వ్యక్తి చనిపోయాడని, నిందితుడికి జైలు శిక్ష పడిందని డీఎస్పీ తెలిపారు. ఒక కేసు ఫాల్స్ గా నిర్ధారణ అయిందన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో నష్టపరహారం ఎంత మందికి అందించారని కలెక్టర్ ప్రశ్నించగా సీసెక్షన్ అధికారిని జయసుధ 2023 నుంచి ఇప్పటిదాకా ఎఫ్ఐఆర్ అయిన 17 కేసుల బాధితులకు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, మిగతాకేసులలో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రొసీడింగ్స్ సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. మిగతా కేసుల నష్టపరిహారం కోసం మొత్తం 40.45 లక్షల ప్రతిపాదనలు పంపించడం జరిగిందని కలెక్టర్‌కు తెలిపారు. ప్రతినెలా 30న సివిల్‌రైట్స్ డే నిర్వహిస్తున్నాం అని డీ ఎస్పీ తెలపగా, ఆయా మీటింగుల మినిట్స్ ఇవ్వడం లేదని ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ చెప్పడంతో స్పందించిన కలెక్టర్ ఇకపై నెలనెలా చేసిన మీటింగ్ మినిట్స్ పంపించాలని ఆదేశించారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కిష్ట్యా నాయక్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కేసులు తొందరగా నమోదు చేయడం లేదని నాలుగైదు రోజుల తర్వాత చేస్తున్నారని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కేసు నమోదు చేయకపోతే నేరుగా తన కార్యాలయంలో వచ్చి తెలియజేయాలని

మిగతా 2లో

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

## - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్‌కర్నూల్, సూర్యన్యూస్:** జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి కొల్లాపూర్ మున్సిపాలిటీల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని గురువారం జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ 3 మున్సిపాలిటీల పరిధిలో 65 వాటిలో ఎన్నికలు నిర్వహించేందుకు 131 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన 158 బ్యాలెట్ బాక్స్ లతో పాటు అదనంగా 20% బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ కొరకు మహబూబ్‌నగర్‌లో గుర్తించడం జరిగిందని, సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెచ్చారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల విషయమై వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలిస్తూ పరిష్కరించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ, వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉందని, షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా నిఘాను ఉంచేందుకు వీలుగా ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ టీంలను నియమిస్తున్నామని అన్నారు. ఓటు చైతన్యం కోసం సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలియజేశారు. బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో తగిన సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులను నియమించేలా ఇప్పటికే సిబ్బందిని గుర్తించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల బయట కూడా సీసీ కెమెరాలు పెట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్‌ల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. కాగా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ దేవ సహాయం, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
శుక్రవారం
23 జనవరి 2026

## రాకొండ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ బషీద్ హౌ మచ్



**తెలకపల్లి సూర్యన్యూస్:** మండల పరిధిలోని రాకొండ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈఓ బషీర్ అహ్మద్ తనిఖీ చేశారు, విద్యార్థులు ఉపాధ్యాయులు హాజరు శాతం దస్త్రాలు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పరిసరాలు పరిశీలించారు, విద్యార్థులకు క్లుప్త పద్ధతిలో బోధన చేయాలన్నారు, అదేవిధంగా నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు, సిఆర్పి రేనయ్య, హెచ?ం రామస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## శ్రీ కురుమూర్తి స్వామి హుండీ ఆదాయం రూ 14, 40,520



**చిన్నచింతకుంట. సూర్యన్యూస్:** తెలంగాణ పల్లె ప్రజల ఆరాధ్య దైవం చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో గురువారం శ్రీ కురుమూర్తి స్వామి వారి హుండీ. లెక్కింపు ను ఆలయ కార్య నిర్వహణ అధికారి మదనేశ్వర్ రెడ్డి దేవాదాయ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాస్ చైర్మన్ జి గోవర్ధన్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు రూ 14,40,520ల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు పాలకవర్గం సభ్యులు పి నాగరాజు కమలాకర్ భాస్కరాచారి గోపాల్ భారతమ్మ చక్రవర్ధన్ రెడ్డి ఆలయ అర్చకులు వెంకటయ్య సత్యనారాయణలి అనంత విజయ్ లక్ష్మీనరసింహ చార్యులు వెంకటేశ్వర్ రెడ్డి ఆలయ సిబ్బంది సేవాసమితి భక్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. జిల్లాలో ఎస్టీ విద్యార్థుల కోసం బెస్ట్ అవలెబుల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని, పంచాయతీలుగా మారిన గ్రామాల్లో ఇంటి నంబర్లను మార్చాలని, ప్రభుత్వ పథకాల అమలులో పైలెట్ ప్రాజెక్టు కింద గిరిజన గ్రామ పంచాయతీ నీ ఎంపిక చేయాలని కిష్ట్యా నాయక్ కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఫైలేట్ ప్రాజెక్టు కింద గిరిజన పంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉల్లాస్ స్కీం అమలు జరుగుతోందని, జిల్లాలో మహిళా అక్షరాస్యత కేవలం 38 శాతమే ఉందని, గట్టు మండలం తర్వాత దేశంలో మహిళా అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నది నారాయణ పేట జిల్లానే అని కలెక్టర్ తెలిపారు. ఉల్లాస్ పథకంలో భాగంగా 4 నెలల వరకు నిరక్షర్యాశులకు వాలంటీర్లను నియమించి ప్రత్యేక తరగతులను నిర్వహించడం జరుగుతుంది ఆమె తెలిపారు. మరో సభ్యుడు ఆశప్ప మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఎర్ర గుట్ట వద్ద 8 ఎకరాలను 1994 దళితులకు ఇండ్ల పట్టాలిచ్చారని, ఆ తర్వాత ఆ స్థలంలో నే డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం చేపట్టారని, ఇప్పుడు అక్కడితోనే ఆగిపోయిందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని దళిత వాడల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆయన కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. చివరగా వచ్చే త్రైమాసిక సమావేశంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ లో కొత్త సభ్యులను ఎన్నుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ శైలజ, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ అజీమ్, డీపీఎం జయన్న,తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే సోదరుడు జి భాస్కర్ రెడ్డి







**చిన్న చింతకుంట సూర్య న్యూస్ :** క్రీడలతోనే మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే సోదరుడు జి భాస్కర్ రెడ్డి అన్నారు గురువారం మండల పరిధిలోని దమగ్నాపూర్ గ్రామంలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తండ్రి స్వర్గీయ గవినోల్ల కృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ డిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడల పోటీలను ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు జి భాస్కర్ రెడ్డి ప్రారంభించి కొంతసేపు సరదాగా బ్యాటింగ్ చేశారు క్రీడాకారులకు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు శరీరదారుడ్యాన్ని దానిపెంపొందించేందుకు దోహదపడతాయన్నారు క్రీడలు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్లమర్రి నరేందర్ రెడ్డి అప్పంపల్లి సింగిల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి సర్పంచులు తెలుగు శివకుమార్ ఏ ఈశ్వర్ సింగ్ ఆంజనేయులు గౌడ్ మండల కాంగ్రెస్ నాయకులు జి అనిల్ రెడ్డి వట్టెం శివకుమార్ బాలకృష్ణారెడ్డి వీరేశం ఎద్దుల మధుసూదన్ రెడ్డి రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగమేళా నిరుద్యోగులకు వరం



**మహబూబ్‌నగర్ సూర్యన్యూస్:** ఎమ్.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి మరియు నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగ మేళాను నిర్వహించారు. ఈఉద్యోగమేళా ద్వారా 164 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగ అర్హత సాధించారు. పార్శ్వ టాటా ఫైనాన్స్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ముత్తూట్ ఫైనాన్స్ ,హిందూజా ఫైనాన్స్,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,మెడ్ ప్లస్,కెవిఎస్ క్రాఫ్,విజన్ ఇండియా వంటి 18 కంపెనీలు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా? కె. పద్మావతి మాట్లాడుతూ,18 కంపెనీల నుండి వచ్చిన హెచ్.ఆర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్?నగర్ నిరుద్యోగ యువతీ యువకులకు 15 వేల రూపాయల నుండి 30 వేల రూపాయల వరకు వేతనము అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్.వి.ఎస్ ప్లేస్?మెంట్ కో–ఆర్డినేటర్ డా. జి. ఆర్., అకాడమిక్ కో–ఆర్డినేటర్ డా? రవీందర్, టి.ఎస్.కె.సి మెంటర్ తేజస్విని, మరియు అధ్యాపకులు పాల్గొని అభినందించారు.

## పేరూరు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు 75 ఏళ్లు

### - ఈనెల 25 న మూడవ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం



**మహబూబ్నగర్ సూర్య ప్రతినిధి:** మహబూబ్నగర్ జిల్లా కౌకుంట్ల మండలం పేరూరు గ్రామంలోని జడ్పీహెచ?స్ పాఠశాల 1950 జూన్ లో స్థాపితమై 2026 ఏప్రిల్ నాటికి 75 ఏళ్ల సుదీర్ఘ విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సన్నాహాలు ఊపందుకున్నాయి. నాటి నుంచి నేటి వరకు వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ పాఠశాల ఘన చరిత్రను స్మరించుకుంటూ, పూర్వ విద్యార్థుల సహకారంతో త్వరలో భారీ స్థాయిలో సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమ్మేళన ఏర్పాట్లపై చర్చించేందుకు మూడవ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం ఈ నెల 25 వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో జరగనుంది. సమ్మేళన కార్యాచరణ, ఆర్థిక వనరుల సమీకరణ, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం తదితర కీలక అంశాలపై కమిటీ సభ్యులు ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నారు. 75 ఏళ్ల విద్యా సేవలకు గుర్తుగా ఈ సమ్మేళనం పాఠశాల చరిత్రలో మరో మైలురాయిగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.

## జడ్చర్లకు తరలిన కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు



**ఊర్కొండ, సూర్యన్యూస్:** మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహించిన సమావేశానికి భారీగా తరలి వెళ్లారు. యువజన కాంగ్రెస్ నాయకుల ముఖ్య సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అద్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి పాల్గొన్న ఈ సమావేశంలో భవిష్యత్తులో యువజన విభాగం నాయకులు కార్యకర్తల పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడి తిరిగి అధికారంలోకి రావడానికి చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశారు. వెళ్లిన వారిలో ఉప సర్పంచ్ పోలె రాజు, అసెంబ్లీ కార్యదర్శి మాసుం, నాయకులు జగదీష్, పవన్, మహేష్, అంజి, వంశీ తదితరులు ఉన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులుగా నర్సింములు



**కోయిలకొండ సూర్యన్యూస్:** కోయిలకొండ మండల డీలర్ల సంఘం మండల అధ్యక్షులుగా కేశవాపూర్ నర్సింములును మండల రేషన్ డీలర్‌లు అంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ, మండలంలో ఉన్న డీలర్ల సమస్యలను పరిష్కరించడానికి తమ వంతుకృషి చేస్తానని ఆయన తెలియజేశారు.రేషన్ డీలర్లకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.రేషన్ డీలర్ల సంఘం నూతనంగా ఎన్నికైనందుకు తాహా శీ ల్దార్ రాజ గణేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు భీ0 రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధమాయపల్లి ప్రవీణ్ చారి, కోశాధికారి నాగరాజు కన్వీనర్‌గా ఎస్. ఆనంద్ గౌడ్, డీలర్ రాము, రాజు నాయక్. సాదిజాబేగం, వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసులు, విజయ్ కుమార్, సంజీవ రెడ్డి, సుజాత, బాసు, తదితరులు పాల్గొన్నారు.

## అనంతపూర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా



**కోయిలకొండ సూర్య న్యూస్** :మండలంలోని అనంతపూర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని నారాయణపేట కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శివకుమార్ రెడ్డి తెలిపారు. అనంతపూర్ గ్రామ ఇందిరమ్మ ఇంటి కమిటీ సభ్యులు వెళ్లి శివకుమార్ రెడ్డి నీ సాధారణంగా కలవడంతో గ్రామానికి సంక్షేమ పథకాలు. వృద్ధులకు పింఛన్లు. ఇందిరమ్మ ఇండ్ల లను మంజూరు చేస్తారని హామీ ఇవ్వడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్. ఇందిరమ్మ ఇంటి కమిటీ నెంబర్ సభ్యులు మున్నూరు భీమ్ రెడ్డి. గోవిందు రెడ్డి. భీమయ్య. చిన్న రాములు. పాల్గొన్నారు.

## పెనిమిళ్ళలో ఉచిత పాడి పశువుల గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం



**ఉప్పునుంతల సూర్య న్యూస్:** ఉప్పునుంతల మండలం పెనిమిళ్ళ గ్రామంలో పాడి రైతులకు ఉపయోగపడే విధంగా ఉచిత పాడి పశువుల గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని నాగర్ కర్నూల్ జిల్లా పశుసంవర్ధక శాఖ మరియు ఋణూ మహబూబ్ నగర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఎం. శ్రీలత విజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కే. జైపాల్ మరియు వార్డు సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డా. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పాడి పశువులకు సకాలంలో గర్భకోశ వ్యాధి పరీక్షలు చేయించి తగిన చికిత్స అందిస్తే అవి సకాలంలో ఎదకు వచ్చి చూళ్లు కట్టే అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు. అలాగే పాడి పశువుల సరైన యాజమాన్య పద్ధతులు, పోషణ, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ పశు వైద్య శిబిరంలో డా. వి. బుచ్చమ్మ, డా. జి. ప్రవీణ్ కుమార్, డా. వై. మల్లేష్ పశువైద్యాధికారులు పశువైద్య సిబ్బంది హబీబ్, ఓఎస్ గోపాలమిత్రులు ఎం.డి. ముజీబ్, గ్రామ విజయ డైరీ సభ్యులు, గోపాలమిత్ర సూపర్వైజర్ గట్టు మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే పలువురు పాడి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# జాతీయ ఉపాధిహామీ పథకం పేరు మార్చే ప్రయత్నం ప్రజా వ్యతిరేక చర్య

- పేదల ఉపాధి రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటాలను కొనసాగిస్తుంది
- రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ చత్రు నాయక్



**లింగాల, సూర్యన్యూస్:** కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చే ప్రయత్నం చేయడం ప్రజా వ్యతిరేక చర్య అని, ఎట్టి పరిస్థితులను కాంగ్రెస్ పార్టీ పేరు మార్పును అంగీకరించదని రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షులు ఛాత్రు నాయక్ అన్నారు. గురువారం డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ,రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ ఆదేశాల మేరకు మండల పరిధి లోని మాడాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని మార్చాలని కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేయాలనుకోవడం తగదని ఆయన తీవ్రంగా విమర్శించారు. గ్రామీణ పేదలకు, కూలీలకు జీవనాధారంగా నిలిచిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చినది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాలకు ఉపాధి కల్పించిన ఈ పథకానికి పేరు మార్పు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. పథకం పేరు మార్పు కంటే, కూలీలకు సమయానికి కూలి చెల్లింపులు, పని దినాల సంఖ్య పెంపు, పెండింగ్ బిల్లుల విడుదల వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతానికి ఇస్తే రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేది కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 60 శాతం ఇస్తే, రాష్ట్రాలకు 40 శాతం వాటాని చెబుతున్నారు కావున ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రతో చేస్తుందని ఆరోపించారు.జాతీయ ఉపాధి హామీ పథకం పేరుతోనే దేశవ్యాప్తంగా ప్రజలకు గుర్తింపు ఉందని, ఆ పేరును మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు.ప్రజల హక్కుల కోసం, పేదల ఉపాధి రక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లికంటి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, మైబు, కరీం, రాజు మహేష్ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే





**అచ్చంపేట సూర్యన్యూస్:** అచ్చంపేట పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు గురువారం నిర్వహించిన క్రీడాజ్యోతి ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ క్రీడాజ్యోతి ర్యాలీ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎంకప్ 2025 రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీ రాష్ట్రవ్యాప్తంగా క్రీడల పై అవగాహన పెంచడంతోపాటు అన్ని గేమ్స్ పట్ల ఆదరణ పెంపొందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, దాంట్లో భాగంగానే సీఎం రెండో విడత కార్యక్రమాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎంపీడీవోలు తాసిల్దార్, ఎంఈఓ, ఫిజికల్ డైరెక్టర్లు, స్థానిక నాయకులు కార్యకర్తలు విద్యార్థులు యొక్క క్రీడాజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం పై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన సర్పంచ్ శైలజా శ్రీనివాసులు రెడ్డి





**మల్దకల్ సూర్య న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాసరెడ్డి తనిఖీ నిర్వహించారు. విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ పథకాల అమలుపై నేరుగా పరిశీలన చేయాలనే ఉద్దేశంతో పాఠశాలను సందర్శించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వ అందించే ప్రతి ఒక్కటి అందించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యత కూడిన భోజనాన్ని అందించాలని అన్నారు. పిల్లల ఆరోగ్యం, విద్యా రెండిటికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం స్కూల్లో ఎమ్మెల్యే సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు బాత్రూములు, వాటర్ సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.దీంతోపాటు గ్రామంలో ఉన్న ప్రజలకు ప్రతిరోజు అందుబాటులో ఉండి గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలకు సేవ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి సత్యారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తెలుగు కృష్ణమూర్తి, వడ్డే గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి సిమెంటు, సీకులు అందజేసిన ఉప్పల



**కల్వకుర్తి సూర్యన్యూస్:** కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన గుబ్బ నరేందర్ ఆర్థిక ఇబ్బందులతో ఇంటినిర్మాణం అసంపూ ర్తిగా ఉండడంతో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చాటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్‌ను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఉప్పల వెంకటేష్ ఉప్పల చారిటబల్ ట్రస్ట్ ద్వారా ఇంటి స్లాబ్ నిర్మాణానికి సరిపడా సిమెంటు, సీకులను గురువారం తన అనుచరుల ద్వారా అందజేశారు, ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్‌కు కుటుంబసభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, నియోజవర్గంలోని పేద ప్రజలకు ఏ ఆపద వచ్చిన ఉప్పల చాటబుల్ ట్రస్ట్ ద్వారా తనకు తోచిన సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

## తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించాలి

### - అంగన్వాడి టీచర్ అలివేలు



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** ఆరు నెల లు నిండిన చిన్నారులకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం తప్పనిస రిగా అందించాలని అంగ న్వాడి టీచర్ అలివేలు తెలిపారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు, చిన్నా రుల ఎదుగుదలకు తల్లిపాలతో పాటు అదనంగా పౌష్టికాహారం అందించాలని అంగ న్వాడి టీచర్ అలివేలు సూచించారు, అంగన్వాడి కేంద్రంలో అందించే బాలామృతాన్ని పిల్లలకు తినిపించాలని ఆమె పేర్కొన్నారు, పౌష్టికాహారం తోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, చిన్నారుల తల్లులు, పిల్లలు తదితరులు ఉన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న జమ్ములమ్మ దేవాలయం



**గద్వాల సూర్య న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా జమ్మిచేడు జమ్మలమ్మ బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుండి ప్రారంభం కానుండగా అమ్మవారి పుట్టినిల్లు అయినా దివి గ్రామం కృష్ణానది మధ్యలోనీ గుర్రం గడ్డ శ్రీ జమ్ములమ్మ దేవాలయాన్ని దేవాదాయ శాఖ అందంగా ముస్తాబు చేస్తున్నది. మంగళవారం అమ్మవారిని జమ్మి చేడు నుండి గుర్రం గడ్డ గ్రామానికి భారీ ఊరేగింపుతో వెళ్లి బుధవారం ఉదయం జమ్మిచేడు ఆలయానికి తీసుకువస్తారు. దేవాలయ ఈవో పురందర కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నుండి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.

# బిజ్వారంలో క్రీడలకు సీఎంకప్‌తో కొత్త ఊపిరి

### - సర్పంచ్ శైలజ శ్రీనివాసరెడ్డి





**మల్దకల్ సూర్యన్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం క్రీడలకు సీఎం కప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ శైలజ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని, సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడ పోటీలు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ పోటీలలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో అథ్లెటిక్స్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో అర్హులైన యువత పెద్దసంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి ఎంపికైన క్రీడాకారులు ఆన్లైన్ ఎన్రోల్ సెక్రటరీల ద్వారా చేసుకోవాలి. మండల స్థాయి 23 నుంచి 31 వరకు, నియోజకవర్గ స్థాయి మూడు నుంచి ఏడు వరకు, జిల్లాస్థాయి 10 నుంచి 14 వరకు, రాష్ట్ర స్థాయి 19 నుంచి 26 తేదీల వరకు నిర్వహించనున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు సీఎంచేతుల మీదుగా బహుమతులు అందజేస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మహేష్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణయ్య, బషీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి సత్యారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, తెలుగు కృష్ణమూర్తి, వడ్డే గోపాల్, ఉపాధ్యాయులు బి శ్రీనివాసులు, ఏ కృష్ణకుమారి, కే విజయభాస్కర్, జి ప్రతాప్ రెడ్డి, జీ కృష్ణయ్య, ప్రసన్నకుమార్, ఏ సతీష్ చంద్ర, శివప్రసాద్, గణేష్, రేణుక, మల్లికార్జున కుమార్, శశిధర్ కులకర్ణి, పి వేణు, రవికుమార్, వనిత, పి.టి రత్న మాల తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరాలో పారదర్శకత పాటించాలి : బీజేపీ నేతల డిమాండ్



**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో ఉన్న యూరియా నిలువలను బీజేపీ మండల అధ్యక్షుడు పరుశరాముడు, జిల్లా కార్యదర్శి తిరుమల్‌యాదవ్ గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను వారు ప్రత్యక్షంగా గమనించారు.రైతులకు రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా యూరియాను అందించాలని, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో యూనియన్ ద్వారా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు సమాన న్యాయం జరగాలన్నారు.రైతులు ఉదయం ఆరు గంటల నుంచే లైన్?లో నిలబడి యూరియా కోసం ఎదురు చూస్తున్నా, ఆ దృశ్యాలు అధికారులకు కనిపించడం లేదా అని బీజేపీ నేతలు ప్రశ్నించారు. యూరియా కొరత కారణంగా సాగు పనులు ఆలస్యమవ్వు తున్నాయని, వెంటనే అదనపు నిలువలు సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు రైతులు పాల్గొన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

# చండి అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే

### - జ్ఞాన సరస్వతి దేవాలయంలో వైభవంగా చండీ హోమం,దత్తాత్రేయ హోమం





**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ సూర్యన్యూస్ :** శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భా గంగా 4వరోజు గురువా రం దేవాలయంలో మహా చండీ హోమం, దత్తాత్రేయ హోమం లను వేదమూర్తు లైన బ్రాహ్మణులచే శాస్త్రోక్తం గా నిర్వహించినట్లు దేవాల య చైర్మన్ ఆకారపు విశ్వ నాథం తెలిపారు. వేద పండితులు పట్నం సురేష్ శర్మ అర్చక బృందంతో గురువారం ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండాలలో మహాచండీ హోమాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రచం ణల మధ్య చేశారు. ఆకారపు విశ్వనాథం, ప్రభావతి, లగిశెట్టి జగదీశ్వరయ్య వరలక్ష్మి దంపతులతో పాటు 21 దంపతులతో మహా హోమాన్ని నిర్వహించారు. చండి అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే అని అన్నారు. చండీ హోమం చేయడంతో వారి కుటుంబాలకు శత్రువినాశనం,సర్వ అభిష్టాల ప్రాప్తి,అష్ట ఐశ్వర్యాలు సిద్ధించడం జరుగుతుందని అన్నారు. దత్తాత్రేయ హోమం చేయడంతో గురుబలం పెరిగి వారి కోరిన కోరికలు నెరవేరుతాయని అన్నారు. మాఘమాసంలో అమ్మవారిని కొలవడం, పూజించడం ఎంతో పుణ్య ఫలితాన్ని భక్తులకు లభిస్తుందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పి నవీన్ కుమార్ పవన్ శర్మ, గోపాల్ శర్మలు గణపతి పూజ, నవగ్రహ పూజలతో పాటు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాస, అర్చనలు వేద మంత్రోచ రణలతో చేశారు. జన్మనిత్యా, గోచారరీత్యా గ్రహాలు శాంతించి విశేష ఫలితం పొందుటకు నవగ్రహ హోమాన్ని చేసినట్లు తెలిపారు. జ్ఞానసరస్వతి పారాయణ కమిటీ సభ్యులచే లలితా సహస్ర పారాయణ పఠనం,మణిద్వీప వర్ణన, లింగాష్టకం భక్తులు సామూహికంగా పఠనం చేశారు. ఆలయఆవరణలో అమ్మవారికి పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా 5వ రోజు మాఘమాసం వసంత పంచమి శుక్రవారంనాడు తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు అన్నప్రాస కార్యక్రమంలు ఉన్నట్లుతెలిపారు. ఈ ప్రాంతంలోని చిన్నారులు అమ్మవారి దర్శనం తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. అక్షరాభ్యాసాలు పూజలకు సెల్ నెంబర్ 9441303182, 9949031319లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమలో దేవాలయ ప్రధాన కార్యదర్శి ఎలిమేఈశ్వరయ్య, కమిటీ సభ్యులు వలిశెట్టి లక్ష్మి శేఖర్ ఇందుమతి, పాండురంగయ్య, బాలస్వామి, నారాయణ రెడ్డి, శారదమ్మ, శివశంకర్,ఈశ్వర్ రెడ్డి, రవికుమార్, భూపాల్ రెడ్డి, శివకుమార్, నవీన్ కుమార్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com



## పేదల సొంతింటి కల సాకారం : ఐజలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు



**ఐజ సూర్యన్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా, ఐజ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గులు పోసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. వార్డులోని లబ్ధిదారులైన తెలుగు సుజాత రామకృష్ణ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి నాయకులు స్వయంగా ముగ్గులు పోయించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 1వ వార్డు ఇన్చార్జ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తెలుగు ఈరన్న మరియు వార్డు ఇన్చార్జి లక్ష్మీ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం అండగా ఉంటుందని, సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకే చేరుస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారి భద్రత నియమాలు పాటించాలి

### - తహసిల్దార్ కార్తీక్ కుమార్



**వెల్దండ సూర్యన్యూస్:** రహదారి భద్రత నియమాలు పాటించాలి అని మండల తహసిల్దార్ కార్తీక్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో గురువారం. మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా తహ సిల్దార్. హాజరై మాట్లాడుతూ వాహనదారులు. హెల్మెట్. సీటు బెల్టు ధరించడం. మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి వాటిపై. రోడ్డు నియమాలు తప్పకుండా పాటించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్. మహమ్మద్. ఏఎస శ్రీనివాసులు. ఎంపీఓ లక్ష్మణ్. మణిపాల్ నాయక్. మోహన్ లాల్. శేఖర్. అంజి. తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చౌక్ వద్ద విద్యుత్ లైన్ల మరమ్మతులు : నూతన పరికరాల ఏర్పాటు

**అయిజ సూర్యన్యూస్:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'ప్రజా బాట' కార్యక్రమంలో భాగంగా, అయిజ పట్టణంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు మరియు పాత విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులను అధికారులు పర్యవేక్షించారు. పట్టణంలో నిరంతర మరియు సజావుగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసేందుకు వీలుగా పాత పరికరాల స్థానంలో నూతన విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేయిస్తున్నారు.



ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీఈ నీలి గోవిందు మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తును అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎక్కడైనా లో వోల్టేజ్ లేదా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ సర్వోత్తమ్, విద్యుత్ శాఖ సిబ్బంది విటల్, రఘువర్ధన్, రామకృష్ణ తదితరులు పాల్గొని పనులను వేగవంతం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా

- బడులపై ప్రత్యేక శ్రద్ధ
- అవకాశాన్ని వినియోగిస్తా
- సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి







**కోడేరు, సూర్యన్యూస్:** అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా ఎంచుకున్నానని సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సూర్యదినపత్రికతో మాట్లాడుతూ కోడేరు ఎన్నో ఏళ్లుగా వెనుకబాటుతనానికి గురైందని, కోడేరు మండల కేంద్రాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకుపోవాలనే అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని కోడేరు సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి అన్నారు. అభివృద్ధిలో ముందుకు సాగుతూ నిరంతరం శ్రమిస్తూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి కృషి పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రత్యేక అధికారుల పాలనలో మరుగున పడిన అభివృద్ధిని గెలిచిన తక్షణమే మరుగున పడిన పనులను బాగు చేస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. మండల కేంద్రంలో ఎక్కడికక్కడ మిషన్ భగీరథ లీకేజీలు ఉండేవి అలాంటి మిషన్ భగీరథ లీకేజీలను గెలిచిన తక్షణమే సరి చేయిస్తూ ప్రతి ఒక్కరికి తాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు చేయించారని మండల ప్రజలు తెలుపుతున్నారు. అలాగే మండల కేంద్రంలో సైడ్ డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపో యి ప్రజలు నానా అవస్థలకు గురయ్యేవారు .అట్టి సమస్యను తీక్షణ దృష్టితో పరిశీలించి ప్రజల ఇబ్బందులను తొలగించాలనే ఆకాంక్షతో కూలీలను నియమించి అలాగే జెసిబి సహాయంతో మురుగు కాలువలను శుభ్రం చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. గెలిచిన తక్షణమే ఎన్నికల హామీలో భాగంగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తాను అన్నట్లుగానే నేడు సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి అభివృద్ధి పనులు ప్రారంభించి అభివృద్ధి పనులను పరుగు పెట్టిస్తున్నారు. గ్రామంలో ఇంకా ఎక్కడెక్కడ మేజర్ సమస్యలు పేరుకుపోయాయో వాటిపై నిరంతరం సమీక్ష చేస్తూ గ్రామ పెద్దల సహకారంతో మరింత ముందుకు సాగాలనే ఆలోచన భవిష్యత్ కార్యాచరణకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. పక్కనే ఉన్న పెద్ద కొత్త పల్లి మండల కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకుంటూ కోడేరు మండల కేంద్రాన్ని కూడా ఆ స్థాయికి తీసుకురావాలి అనడంలో సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి దృష్టిఎంతో ఆకాంక్షించదగ్గదిగా పేర్కొనవచ్చు. అదేవిధంగా మండలంలోని కస్తూర్బా పాఠశాల ఆవరణ చుట్టుపక్కలో మురుగునీరు పేరుకుపోయి ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యేవారు అట్టి సమస్యను సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి సత్వరమే పరిష్కరించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కస్తూర్బా పాఠశాలలో మరిన్ని పనులు చేపట్టేందుకు తన వంతుగా కృషి చేస్తానని ప్రిన్సిపాల్‌కు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. విద్యలో ఉపాధ్యాయులు ఎక్కడ రాజీపడకుండా నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. అలాగే గురుకుల పాఠశాలలో మురుగునీరు వెళ్లేందుకు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందిగా ఉండడంతో అట్టి సమస్యను సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి గెలిచిన తక్షణమే మురుగునీటి పారుదల సౌకర్యం కల్పించి విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా శ్రద్ధ తీసుకోవడం పట్ల నడింపల్లి మహేశ్వర్ రెడ్డి కి విద్యా వ్యవస్థపై ఉన్న చిత్తశుద్ధి కి ఎంతో హర్షించదగ్గ విషయంగా చెప్పుకోవచ్చు. ఎప్పటికప్పుడు కార్యకర్తలను అప్రమత్తం చేస్తూ పాఠశాలల ఇబ్బందులను, మండల కేంద్రంలోని ఆయా కాలనీలలోని సమస్యలను గుర్తిస్తూ స్వయంగా పర్యవేక్షణ చేస్తూ అభివృద్ధి పనులను పరిగెత్తించడంలో ఎక్కడ రాజీ పడలేదని చెప్పవచ్చు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాతబడిన భవనాలను తొలగించి విద్యార్థులకు అవసరమయ్యే విధంగా కొత్త భవనాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు సరైన బాత్రూం లు లేవని తక్షణమే వాటి ఏర్పాటుకు కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపల్ కోరారు. దీంతో ఆయన స్పందిస్తూ పాత భవనాలను తొలగించి కొత్త వాటి ఏర్పాటుకు బాత్రూంల నిర్మాణానికి చర్యలు చేపట్టేందుకు కొంత సమయం కావాలని తొందరలోనే వాటి ఏర్పాటు కూడా పూర్తి చేశానని ఆయన సూచించారు. ఇందుకు గాను ఆయన మాట్లాడుతూ ఎంపీ డాక్టర్ మల్లురవి దృష్టికి తీసుకుపోయి పాఠశాలల్లోని మౌలిక వసతుల కల్పన కు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో ఎక్కడెక్కడ సమస్యలు పేరుకు పోయాయో అందుకుగాను ఎంత నిధులు ఖర్చయితాయో పక్కా ప్రణాళికతో పని చేస్తాన న్నారు. గెలిచిన నాటినుండి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తుండడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**కోడేరు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తా ..** కోడేరు గ్రామ అభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి నిరంతరం శ్రమించి అందుకుగాను ఎంత నిధులు ఖర్చయితాయో ఎవరిని ఎలా కలవాలో నాకు బాగా తెలుసు అని సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను అధికారుల దృష్టికి మరియు రాజకీయ నాయకుల దృష్టికి తీసుకుపోయి ఎప్పటికప్పుడు అభివృద్ధి, సంక్షేమంపై వెనక్కి తగ్గకుండా అందరి సమన్వయంతో ముందుకు సాగుతానని ఆయన అన్నారు. ఈ మధ్యకాలంలోనే మండల కేంద్రంలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ డాక్టర్ మల్లురవి దృష్టికి మరియు అధికారుల దృష్టికి తీసుకుపోయానని ఆయన తెలిపారు. గ్రామంలో కొన్ని కాలనీలలో సైడ్ డ్రైనేజీల వల్ల చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని అట్టి డ్రైనేజీలను కూడా తొలగించి అండర్ డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాననీ ఆయన అన్నారు.

**– సర్పంచ్, నడింపల్లి మహేశ్వర్ రెడ్డి, కోడేరు**

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుంది

### - సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్



**మిడ్జిల్ సూర్య న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు మాత్రమే నాణ్యమైన విద్య అద్భుతుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని దోనూరు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 66 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య దొరుకుతుందని ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ పాఠశాలలోనే వారిని చేర్పించాలని కోరారు. ఇక ముందు కూడా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మరిన్ని మౌలిక వసతులు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సర్పంచ్ తన సొంత ఖర్చులతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించడం వలన ఆయన గొప్ప మనసుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనను సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తారా సింగ్ పాఠశాల కమిటీ చైర్మన్ జగదీశ్వరి. ఉపాధ్యాయులు లక్ష్మయ్య, కృష్ణ నాయక్, అంజమ్మ వార్డు సభ్యులు ఆంజనేయులు, సుధాకర్ రెడ్డి, రవి, జగ్గయ్య, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
శుక్రవారం
23 జనవరి 2026

## మాస్టర్ మైండ్స్ స్కూల్లో రోడ్డు భద్రత మాసోత్సవాలు



**పెబ్బేరు సూర్య న్యూస్ :** ప్రతి ఏటా జనవరి ఒకటి నుండి జనవరి 31 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాలను పెబ్బేరు మున్సిపాలిటీలో మాస్టర్ మైండ్ స్కూలు వెహికల్ ఇన్స్పెక్టర్ కె .వాసుదేవరావు గారు మరియు పాఠశాల డైరెక్టర్ ఈర్లదిన్నె. రంగారెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డి మాట్లాడుతూ రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు పాటించవలసిన నియమ నిబంధనల గురించి వివరించారు మరియు జీవితం యొక్క విలువ అపారమైనదని దానిని అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదాల బారినబడి ముగించవద్దని తెలియజేశారు. వెహికల్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు నిండని విద్యార్థులందరూ వాహనాలు నడపరాదని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని, సీట్ బెల్ట్ ,హెల్మెట్ ధరించాలని మరియు ట్రాఫిక్ సిగ్నల్స్ ని పాటించాలని తెలియజేశారు. రోడ్డు భద్రత ఉత్సవాల మీద విద్యార్థులు మరియు పాఠశాల బస్ డ్రైవర్లు ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజ్వారం రోడ్డు నెరవేరిన గ్రామస్తుల కళ



**మల్దకల్ సూర్య న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామానికి తారు రోడ్డు అనేది 16 సంవత్సరాల తర్వాత నెరవేరింది. అయినా ఆ గ్రామానికి వెళ్లాలంటే నిత్యం ఒడిదుడుగుల ప్రయాణమే. మట్టి రోడ్డు లోని అడుగడుగున గుంతల్లో గ్రామస్తులు అవస్థల ప్రయాణం గద్వాల జిల్లా వరకు సాగించేవారు. గురువారం కాంట్రాక్టు అధికారులు గద్వాల మండలం జిల్లెడు బండ గ్రామం నుంచి సంఘాల వరకు తారు రోడ్డు పనులు ప్రారంభించారు. అటువైపుగా వస్తున్న బిజ్వారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బి.నారాయణ నాయుడు తారు రోడ్డు పనులను పరిశీలించి, కాంట్రాక్టు అధికారులకు రోడ్డు మంచిగా వేయాలని తెలిపారు.

## ఎస్బిఐ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన ఫీల్డ్ ఆఫీసర్



**ఇటిక్యాల సూర్యా న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండల కేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవం జరగనుంది. ఈ విశేష కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ని, అలంపూర్ శాసనసభ్యులు విజయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన ఫీల్డ్ ఆఫీసర్ తిరుమలేష్ వారు సిబ్బందితో పాటు శాలువాతో సత్కరించి, ముఖ్య అతిథులుగా పాల్గొనమని ఆహ్వానించారు.దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆర్. కిషోర్ పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



**నవాబుపేట్ సూర్య న్యూస్:** మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది.ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మహమ్మదాబాద్ శివకుమార్(35)కు గత 8సంవత్సరాల క్రితం మండలంలోని విర్సానిపల్లి గ్రామానికి చెందిన లలితతో వివాహం జరిగింది.వీరికి ఇద్దరు మగ సంతానం కలరు.కాగా లలిత వేరే వారితో అక్రమ సంబంధం కలిగి ఉందనే అనుమానంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతుండేదని.ఈ విషయంలో కుటుంబ సభ్యులు శివకుమార్ కు నచ్చజెప్పడం జరిగింది.కాగా బుధవారం రాత్రి భార్యా పిల్లలు భోజనం చేసి నిద్రపోయారు.గురువారం తెల్లవారుజామున శివకుమార్ ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది.క్షణికావేశానికి గురై మనస్థాపంతో శివకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

### - రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి



**పాలమూరు సూర్య న్యూస్:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా యువజన కాంగ్రెస్ నాయకులు కష్టపడి పనిచేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మహబూబ్నగర్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి యువజన కాంగ్రెస్ విభాగం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు టికెట్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్నదని ఆరోపించారు. చట్టంలో గాంధీ పేరు తొలగించడం సరికాదన్నారు. పేదల హక్కును కాలరాయడానికి చట్టాన్ని మార్చిందని ఆరోపించారు. ఉపాధిహామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యువజన విభాగానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీలో యువజన నాయకులకు ఎంతో భవిష్యత్తు ఉందన్నారు. యువజన విభాగం గట్టి ఉంటేనే కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, మార్కెట్ కమిటీ, చైర్ పర్సన్ బెక్కరి అనిత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు శివంత్ రెడ్డి, సంధ్య, జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఆవేజ్, ఉపాధ్యక్షులు మహేష్, శ్రీను, ప్రధాన కార్యదర్శులు సంజీవ్ రెడ్డి, ఇంతియాజ్, సురేష్, అలావుద్దీన్, ఫైజాన్ , మహబూబ్ నగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఎండి. సల్మాన్, నాయకులు పాల్గొన్నారు.

# ఉర్కొండ మండలాన్ని కల్వకుర్తి రెవెన్యూలోనే కొనసాగించాలి

### బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లాఅధ్యక్షుడు నిరంజన్ గౌడ్

### 13వ రోజు రిలే దీక్షలు విరమణ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాము



**ఊర్కొండ, సూర్య న్యూస్:** ఊర్కొండ మండలాన్ని కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ లోనే ఉంచాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నాటికి రిలే.దీక్షలు 13వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊర్కొండ మండలం పట్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను వెనకకు తీసుకోవాలని అన్నారు. మండల జేఏసీ ఆధ్వర్యంలో గత 13 రోజులుగా రిలే దీక్షలు కొనసాగిస్తున్న ఎవరు పట్టించుకోవడంలేదని అన్నారు. మండలంలో ఉన్న ప్రజలందరూ ఉద్యమంలో కలిసి రావాలని జేఏసీ పిలుపునిస్తున్నామని అన్నారు. 13వ రోజున యొక్క దీక్షకు సంపూర్ణ మద్దతుగా బిజెపి సీనియర్ నాయకులు గుజ్జుల ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉద్యమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. అఖిల పక్ష జేఏసీ అద్వర్యంలో గత 13 రోజులుగా వినూత్న రీతిలో దీక్షలు కొనసాగుతుంటే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మండలానికి విచ్చేసి ఈ ప్రాంత ప్రజల బాగోగుల గురించి మాట్లాడకుండా.. జేఏసి నాయకులను అర్ధరాత్రి హౌస్ అరెస్టులు చేయించిన ఎమ్మెల్యే.. అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలనే కనీస అవగాహన లేకుండా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా ఇష్టానుసారంగా అసెంబ్లీ సాక్షిగా తన స్వార్థ రాజకీయ లబ్ది కోసం ప్రకటనలు చేయడం అమానుషమని అన్నారు. 13 వ రోజున ఈ నిరాహార దీక్ష విరమణ చేపడుతూ తదుపరి కార్యాచరణ గ్రామ స్థాయిలో తీసుకెళ్ళాలి అని ఎజెండా తో కలిసికట్టుగా ముందుకు వెళ్ళాలి అని దిశ నిర్దేశించుకోవడం జరిగింది.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కొనసాగుతున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

### 'అరైవ్ అలైవ్'తో ప్రాణాల రక్షణకు అడుగు





**గద్వాల సూర్య న్యూస్ :** తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం జోగులాంబ గద్వాల జిల్లాలో విస్తృతంగా కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్ర గౌరవ డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆలోచనతో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమం, ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రజల మధ్యకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో "అరైవ్ అలైవ్" రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా, నేడు జిల్లా వ్యాప్తంగా (బ్లాక్ స్పాట్స్) ప్రమాదకర ప్రాంతాలపై అవగాహన కలిపించాలిసిందిగా రోడ్డు ప్రమాదాల తరువాత బాధితకుటుంబాలు ఎదురుకొన్న సమస్యల గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత నియమాలను సమర్థవంతంగా అమల్లో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని పోలీసు అధికారులు వారు వారి పరిధిలోని (బ్లాక్ స్పాట్స్) ప్రమాదకర ప్రాంతాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లాలోని గుర్తించబడిన ప్రమాదకర రహదారి ప్రాంతాల్లో బాధిత కుటుంబాలు, ప్రయాణికులు, స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించి, ప్రమాదాలకు కారణాలు, జాగ్రత్తలు, తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీట్?బెల్ట్ దరించాలని తెలిపారు. అంటే కాకుండా మద్యం సేవించి వాహనం నడపకూడదని, అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని ప్రజలకు వివరించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలియజేశారు. బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రోడ్డు మలుపులు, గుంతలు, సిగ్నల్ లేని ప్రాంతాలపై సంబంధిత శాఖలకు సూచనలు పంపడం జరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు



**కల్వకుర్తి సూర్యన్యూస్:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డుకు చెందిన 20 మంది బిఆరస్ పార్టీ నాయకులు గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్, టీపిసిసి అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి రత్నమాల బృంగి ఆనంద్ కుమార్, పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో నాయకులు శానవాజ్ ఖాన్, గోరటి శ్రీనివాసులు, మబ్బు రామరాజు, సంతు యాదవ్, చెన్న కేశవులు, మందుల ఈశ్వరయ్య తో పాటు ఏనుగొండ నరేందర్, పంబల్ల కుమార్, సాదీక్, బీసా హుస్సేన్, కమాటం మురళి, కమాటం దామోదర్, చిన్న, ముత్యాల రమేష్, నేరటి పరుశరాములు, పోలె శివ, రఫీ, కిరణ్, నర్సింహా, విక్కీ, దొడ్డి శివ, అర్జున్, శివకుమార్, గద్ద శ్రీకాంత్, తోటపల్లి శివ, పోలె శివ, ఘూవారియా, అర్జున్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**ఉప్పునుంతల సూర్య న్యూస్:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన క్యాలెండర్?ను గురువారం ఉప్పునుంతల మండల తహసిల్దార్ కార్యాలయంలో మండల తహసిల్దార్ సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం, అలాగే ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. కార్మికుల హక్కుల సాధనలో సంఘం ముందుండి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కంచే హుస్సేన్, జిపిఓలు ఉమా, కార్యాలయ సిబ్బంది శివ, రమణమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఓట్ల కోసమే చీరల పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### అదనపు కలెక్టర్ నర్సింగ రావుకి వినతిపత్రం అందజేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు



**గద్వాల సూర్యన్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ ఎలక్షన్స్ సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయానికి పాల్పడిందని బతుకమ్మ చీరలు గత రెండు సంవత్సరాల నుంచి పంచకుండా కేవలం ఎలక్షన్ల ముందు ఎలక్షన్ల కోసం, ఓట్ల కోసం రేవంత్ రెడ్డి అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీ పరిధిలో మహిళలకు చీరల పంపిణీ చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలక్షన్లు ఎప్పుడు పెట్టిన ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కావున కలెక్టర్ వెంటనే స్పందించి ఈ యొక్క చీరలు పంచుతున్న అధికారుల పైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ అక్కల రమాదేవి,జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,మాజీ కౌన్సిలర్ త్యాగ రాజు ,మహిళ మోర్చా భారతి, బిజెపి నాయకుడు రమేష్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**వంగూరు సూర్య న్యూస్ :** మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన గోరెంకాల లక్మయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యం తో బాధపడుతూ గురువారం ఉదయం చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సలేశ్వరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పసర్పంచ్ యాదగిరి మాజీ సర్పంచ్ బక్కయ్య వార్డ్ సభ్యులు అంజయ్య రమేష్ తిరుపతయ్య మల్లయ్య కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బౌరాపురం మల్లికార్జున స్వామి కళ్యాణానికి అడవి బిడ్డలే పూజారులు.



**అచ్చంపేట సూర్యన్యూస్:** అచ్చంపేట నియోజకవర్గం అమరాబాద్ నల్లమల అటవీ ప్రాంతంలోని బౌరాపురంలో వెలసిన గౌరమ్మ మల్లికార్జున స్వామి కళ్యాణానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏటా శివరాత్రి సందర్భంగా జరిగే ఈ వేడుకల్లో అడవి బిడ్డలే (చెంచులు) పూజారులుగా వ్యవహరిస్తారు. ఇక్కడ ప్రత్యేకత ఈ అపురూప వేడుకను వీక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీగా తరలివస్తారు. ప్రకృతి వడిలో అడవి బిడ్డల ఆధ్వర్యంలో జరిగే ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

## అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు తరలివచ్చిన వివిధ రకాల పంటలు.



**అచ్చంపేట సూర్య న్యూస్ :** అచ్చంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో గురువారం వివిధ రకాల పంటలు రైతులు తీసుకొచ్చారు. వేరుశనగ క్వింటాల్కు మొదటి రకం 9,656, రెండో రకం 9,306, మూడో రకం వేరుశనగ 8,606 గిట్టుబాటు ధర పలికింది. కందులు మొదటి రకం 7,129, రెండో రకం 7, 074, మూడో రకం 6,950 ధర పలికింది. మొక్క జొన్న మొదట రకం ఒక వెయ్యి 1,757, రెండు మూడో రకాలు సైతం అదే ధర పలికాయని వ్యవసాయ మార్కెట్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరు - మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్



**ఉప్పునుంతల సూర్య న్యూస్ :** ఉప్పునుంతల మండలంలోని అర్హులైన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. రైతుల సాగు ఖర్చులు తగ్గించి, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ దిగుబడులు పెంచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద రైతులకు రోటావేటర్లు, పవర్ స్ప్రేయర్లు సబ్సిడీపై మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సబ్సిడీ వివరాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు, సన్న మరియు చిన్న రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. రోటావేటర్ల మంజూరుకు సంబంధించి ట్రాక్టర్ ఆర్?సీ తప్పనిసరిగా వ్యవసాయ వినియోగం పేరిట ఉండాలని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసే రైతు పేరు మీద కనీసం ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇందుకు భూమి పాస్?బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్?సీ (వ్యవసాయ వినియోగం), బ్యాంక్ ఖాతా వివరాలు వంటి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందదలచిన అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, రైతులు తమ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు



**నవాబుపేట్ సూర్య న్యూస్:** మండలంలోని ఇప్పటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం నూతన బాస్కెట్ బాల్ కోర్టును గ్రామ సర్పంచ్ దుబ్బ రవి కిరణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్, పంచాయతీ కార్యదర్శి కల్పన,నాయకులు అరవింద్, శ్రీకాంత్, నర్సింలు, మీనాక్షి ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసుల్లో ఐదురికి అరెస్టు ఎస్ఐ బి నరేష్



**తెలకపల్లి సూర్య న్యూస్ :** తెలకపల్లి లో గంజాయి కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు, పోలీస్ స్టేషన్లో గురువారం సాయంత్రం ఎస్సై బి.నరేష్ విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు, ఉదయం గ్రామ సమీపంలో కంప చెట్ల మధ్య గంజాయి తాగుతున్న వ్యక్తుల సమాచారం రావడంపై వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించి గంజాయి తాగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు, తెలకపల్లి కి చెందిన జహీర్ ఖాన్, నాగర్ కర్నూల్ కి చెందిన బొమ్మసాని సాయి, అచ్చంపేటకు చెందిన ఎస్కే కాజా, రమావత్ గోపి, మాచారం కు చెందిన రామకృష్ణ లు మిత్రులు, వీరు తరచూ కలుసుకొని గంజాయి తాగుతుంటారు, అచ్చంపేటకు చెందిన గోపి హైదరాబాదులో అన్వేష్ అనే వ్యక్తి నుండి గంజాయి కొని తెస్తుంటాడు, ఈ వ్యక్తుల నుండి 12 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేష్ వివరించారు, ఈ కేసులో ఐదుగురిని కోర్టు ద్వారా రిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు, యువత గంజాయి కి అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని కోల్పోకూడదని ఎస? సూచించారు.

## శాఖహార జంతువుల లెక్కింపు విజయవంతం



**లింగాల సూర్య న్యూస్ :** లింగాల రేంజ్ పరిధిలో అచ్చంపేట డివిజన్ ఎఫ్ డిఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మూడవ రోజు పద్మన్నపల్లి బీట్ ఏరియాలో ఉదయం 6 గంటల నుండి 2 కిలోమీటర్ల మేర ట్రాన్సెక్ట్ లైన్ సర్వే నిర్వహించిన్నట్లు లింగాల ఎఫ్ ఆర్ఓ ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా చుక్కల తోపులు, మనుబోతులు, కొండముచ్చులు, నీలిగాయలు, అడవి పందులు, కొండగొర్రెలు, నెమళ్లు, అడవి కోళ్ళు తదితర వన్యప్రాణులు గమనించబడ్డాయని వెల్లడించారు. అనంతరం మర్లపాయ, లింగాల, దారారం బీట్ ఏరియాలలో లింగాల డి ఆర్.ఓ జయదేవ్, సంబంధిత ఎఫ్?బీఓల ఆధ్వర్యంలో శాకాహార జంతువుల పునః లెక్కింపు మూడవ రోజున విజయవంతంగా నిర్వహించబడిందని తెలిపారు. నేటి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు రెండవ విడతగా పులుల గణనతో పాటు ఇతర మాంసాహార జంతువుల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు



**ఆత్మకూరు/ సూర్య న్యూస్:** ఆత్మకూరు పట్టణానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, గురువారం నియోజకవర్గం మక్తల్ పట్టణం నందు, రాష్ట్ర పశు సంవర్ధక క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో ఆత్మకూరు పట్టణానికి చెందిన 9వ వార్డు బిజెపి నేత సద్దల వెంకట రాములు, మరియు టిఆర?స్ నాయకులు జగదీష్ , కావటి అనిల్ కుమార్ యాదవ్, శంకర్ ,జక్లేట్ శివ, రాజు, గాండ్ల శ్రీను, తదితరులు చేరారు .ఈ సందర్భంగా మంత్రి పార్టీ కండువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు, తులసిరాజు, గాండ్ల రఘు, వి అనిల్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రేరణ తరగతులు ఎం.వి.రామన్ పాఠశాల చైర్మన్

**ఆత్మకూరు /సూర్య న్యూస్:** ఆత్మకూరు పట్టణంలో నేడు శుక్రవారం ఎంవి రామన్ పాఠశాల నందు మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ప్రముఖ మనో విశ్లేషణ తత్వవేత్త ,మోటివేషనల్ స్పీకర్ శ్ బాలలత మల్లవరపు ఐఏఎస్ గారిచే విద్యార్థులకు, భవిష్యత్తు విద్యా అవకాశాలు ప్రేరణ తరగతుల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పాఠశాల చైర్మన్ ఎం శ్రీధర్ గౌడ్ తెలిపారు.



M SRIDHAR GOUD
CHAIRMAN

## సూర్య దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎంపిపి వై. సత్యారెడ్డి



**మల్దకల్ సూర్యన్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సూర్య దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్?ను మాజీ ఎంపిపి వై సత్యరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. సత్యం విలేకరులతో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సత్య రెడ్డి మాట్లాడుతూ... సమాజంలోని ప్రతి సమస్యను వెలికితీస్తూ, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సూర్య పత్రిక ఒక వారధిలా పనిచేస్తుందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుతూ పత్రికా విలువలను కాపాడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేపల కండ్ల కర్రెన్న, సుభాను, ఎల్లప్ప, గోపాల కృష్ణయ్య, జల్ల గోకారన్న, బంధం బాయి కృష్ణ, లక్ష్మన్న, దేవ సాయం, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

## పాతకక్షలతో కర్రలతో వ్యక్తిపై దాడి



**నవాబుపేట్ సూర్యన్యూస్:** పాతకక్షలతో వ్యక్తిపై కర్రలతో దాడికి పాల్పడ్డ ఐదుగురిమీద నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన కోరే అశోక్(23)కుటుంబానికి అదే గ్రామానికి చెందిన బలిజ వీరేష్ కుటుంబానికి పొలం దగ్గర ఉన్న బోరు మోటర్ కనెక్షన్ విషయంలో గతంలో గొడవ జరిగింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న వీరేష్ కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం అశోక్ ఇంటికి వస్తుండగా వీరేష్, శైలజ, శివకుమార్, శ్రీశైలం, ద్వారకలు అడ్డగించి కర్రలతో అశోక్ పై విచక్షణరహితంగా దాడి చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న అశోక్ ను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడి పై దాడికి పాల్పడిన వ్యక్తుల పైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అశోక్ తండ్రి పార్వతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

## దాబాలలో మద్యం విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు

### - టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి సూర్యన్యూస్:** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పలు దాబాలలో అక్రమంగా మద్యం విక్రయించడం, మద్యం సేవించేందుకు అక్రమ సిట్టింగ్లు నిర్వహించడం జరిగితే దాబా యజమానుల పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈరోజు సాయంత్రం ఆకస్మికంగా పలు దాబాలను తనిఖీ నిర్వహించామని, దాబాలలో మద్యం విక్రయించడం గానీ, మద్యం సేవించేందుకు సిట్టింగ్లు ఏర్పాటు చేయడం గానీ చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, దాబా యజమానులు చట్టాలను కచ్చితంగా పాటించాలని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రంజాన్ పండగ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**నారాయణ పేట టౌన్ సూర్య న్యూస్ :** వచ్చే నెలలో ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలకు( రోజా), రంజాన్ పండగ రోజు కల్పించాల్సిన ఏర్పాట్ల పై గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా రంజాన్ మాసాన్ని, పండగను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని, రంజాన్ మాస ఉపవాస దీక్షలకు అవసరమైన వసతి, సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు పట్టణంలో తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని కోరారు. ముఖ్యంగా ఆ నెల మొత్తం విద్యుత్ సరఫరా కు ఆటంకం లేకుండా ఆ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీటితో పాటు మసీదులు, ఈద్గాల వద్ద రోజూ సాయంత్రం మున్సిపాలిటీ చెత్త ఆటో రిక్షా ను అందుబాటులో ఉంచాలని, ఇఫ్తార్ ముగిసిన తర్వాత వ్యర్థ పదార్థాలను ఆ ఆటో రిక్షాల లో వేస్తారని లేదంటే ఆయా ప్రాంతాల్లో దుర్గంధం నెలకొంటుందని చెప్పారు. రంజాన్ పండగ కు పది రోజుల ముందు పట్టణంలో దుకాణాలు రాత్రి వేళల్లో తెరచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని, పండగ షాపింగ్ ఎక్కువగా రాత్రి వేళల్లోనే చేస్తారని మైనార్టీ నాయకులు తెలిపారు. రంజాన్ పండగ రోజు ఈద్గా వద్ద షామియానాలు, టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలని వారు కోరారు. రంజాన్ పండగ రోజు ఈద్గా వద్ద కు రావాలని జిల్లా కలెక్టర్ ను నాయకులు కోరారు. మైనార్టీ నాయకులు కోరిన వాటిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. శాఖల వారీగా అధికారులు ఆయా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామంలోనూ తగిన ఏర్పాట్లు చేయాలని డిపివో సుధాకర్ రెడ్డి కి కలెక్టర్ సూచించారు. అయితే రంజాన్ నెలలోనే హోలీ పండుగ వస్తుందని, పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ముందస్తు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. రంజాన్ పండగ సందర్భంగా పోలీసు శాఖ ఇచ్చిన రాత్రి సమయం సడలింపును కొందరు యువకులు దుర్వినియోగం చేసుకునే అవకాశం ఉందని, అలా జరగకుండా ముస్లిం మత పెద్దలు పోలీసు శాఖకు సహకరించాలని డీ ఎస్పీ కోరారు. ఏదైనా చిన్న సంఘటన జరిగినా పట్టణ పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్పీ డాక్టర్ వినీత్ మైనార్టీ నాయకులకు సూచించారు. జిల్లాలో పోలీసు స్టేషన్ ల వారీగా శాంతి సమావేశాలు ఏర్పాటు చేసి, పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. కాగా రంజాన్ నెలలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగితే విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ 8712470307 ను సంప్రదించాలని విద్యుత్ శాఖ అధికారి కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, మున్సిపల్ మేనేజర్ అజీమ్, మైనార్టీ నాయకులు అమీరొద్దీన్, సర్ఫరాజ్ అన్సారి, మహిమూద్ ఖురేషీ, అజీమ్ మడ్కీ, ఫిరోజ్, మహిమూద్, అజహర్, ఎం.ఐ.ఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, పట్టణ అధ్యక్షుడు తఖి, ఫీర్ తఖి తదితరులు పాల్గొన్నారు.

# పోలేపల్లి సేజ్‌లో రోడ్డు భద్రతపై అవగాహన





**పాలమూరు సూర్య న్యూస్:** ఎస్పీడీ జానకి ఆధ్వర్యంలో గురువారం జడ్చర్ల రాజాపూర్ పరిధిలోని పోలేపల్లి సేజ్ లో అమనీల్ ఆంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బందికి "అరైవ్ లైవ్ " రోడ్డు భద్రత అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారు లో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా వాడాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దని రాంగ్ రోడ్డు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని రోడ్డు భద్రత నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రజలందరూ సహకరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ లక్ష్మణ్ గుహీలోత్, జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జున గౌడ్, రాజాపూర్ ఎస్సై శివానందన్ గౌడ్, పోలీస్ సిబ్బంది, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** జిల్లాలోని నారాయణ పేట,మక్తల్, కోస్గి, మద్దూరు మున్సిపాలిటీ లలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని గురువారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మహబూబ్ నగర్, గద్వాల, వనపర్తి, నాగరకర్నూలు, నారాయణ పేట జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు తెలిపారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఆర్.ఓ ఏ.ఆర్.ఓ ల ను గుర్తించడం జరిగిందని తెలిపారు. .పోలింగ్ నిర్వహణకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. మొత్తం 4 మున్సిపాలిటీలకు గాను 149 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, అవసరమైన బ్యాలెట్ బాక్స్ లు సిద్ధంగా ఉన్నట్లు, పోలింగ్ కేంద్రాల్లోవెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు.కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్,ఎస్.ఎస్.టి బృందాల కు మెజిస్టీ రీయల్ అధికారాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కాగా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక జిల్లా అదనపు రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, నోడల్ అధికారులు,మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి

### - మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి



**పాలమూరు సూర్యన్యూస్:** కాంట్రాక్ట్ కార్మికులను, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఇలాంటి ఉద్యోగ భద్రత లేకుండా శ్రమ, ఆర్థిక దోపిడికి గురిచేసే కాంట్రాక్టు ఏజెన్సీల వ్యవస్థను రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర వాల్ క్యాలెండర్స్, టేబుల్ క్యాలెండర్స్ లను గురువారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆస్పత్రి వివిధ రంగాల కార్మికుల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మెడికల్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి)ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోటేశ్వర్ రెడ్డికి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, బ్రాంచ్ నేతలు, కార్మికులు బి.చెన్నయ్య,దేవానంద్, నాయకులు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు ఉలెన్ బ్లాంకెట్స్ పంపిణీ



**మహమ్మదాబాద్ సూర్యన్యూస్:** మాజీ రెవెన్యూ శాఖ మంత్రి కమతం రాంరెడ్డి ఆశీస్సులతో హాస్టల్ విద్యార్థులకు బ్లాంకెట్స్ పంపిణీ చేసిన మాజీ డిసిసిబి చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకుమారుడు కమతం శ్రీరామ్ రెడ్డి.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో మెంబర్ గా కొనసాగుతున్నాడని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో వారి తాత కీర్తిశేషులు కమతం రాంరెడ్డి. ఆశీస్సులతో హాస్టల్ విద్యార్థులకు బ్లాంకెట్స్ పంపిణీ చేయాలని తెలుపగా నేడు ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలోని 30 మంది పేద విద్యార్థులకు మరియు ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహంలోని 30 మంది పేద విద్యార్థులకు బ్లాంకెట్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు హాస్టల్లో పౌష్టికాహారం తింటూ శ్రద్ధతో చదువుకోవాలని తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని అన్నారు. రాబోయే రోజులలో ఎస్సీ.ఎస్టీ. ప్రజలకు కూడా వారికి మేలు జరిగే విధంగా ఏదైనా సహాయం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ బి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనంతయ్య గుప్తా. షేరి రవి. రాంరెడ్డి. హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



**నవాబుపేట్ సూర్య న్యూస్:** మండలంలోని శ్రీపర్వతాపూర్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల ప్రమాదానికి గురై కాలు ఫ్యాక్చర్ కావడం జరిగింది.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి,గురువారం జడ్చర్లలో జగన్మోహన్ రెడ్డి నివాసానికి వెళ్లి చైర్మన్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ పుష్పలత,సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్ గౌడ్, నాయకులు రాజు,అశోక్ యాదవ్,దామోదర్,రామస్వామి,శివ తదితరులు ఉన్నారు.

## గోశాలకు గోవులను తరలింపు



**చిన్నచింతకుంట సూర్యన్యూస్:** పేదలతిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామం సమీపంలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం భక్తులు స్వామి వారికి సమర్పించిన 5 గోవులను మహబూబ్నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్పల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ గోశాలకు తరలించడం జరిగిందని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి మదనేశ్వర్ రెడ్డి చైర్మన్ జి గోవర్ధన్ రెడ్డి తెలిపారు గోవులను తరలింపు కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పి నాగరాజు భాస్కరాచారి కమలాకర్ పూజారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా పడి ఒకరు మృతి ముగ్గురికి గాయాలు



**మిడ్జిల్ సూర్య న్యూస్:** మండలంలోని మసి గుండ్లపల్లి గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి బోల్తాపడి ఒకరు మృతి చెంది ముగ్గురు గాయాల పాలైన సంఘటన గురువారం జరిగింది. ఎస్సై శివ నాగేశ్వరరావు నాయుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మసిగొండ్లపల్లి గ్రామం నుంచి మిడ్జిల్ కు వస్తున్న ప్యాసింజర్ ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో కొత్తపల్లి గ్రామానికి చెందిన నరసయ్య, స్వప్న, ఇదిలాబాయి తండాకు చెందిన పూర్యానాయక్, మసి గుండ్లపల్లి గ్రామానికి చెందిన రాములు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య(80) చనిపోయాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

### - అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్



**గద్వాల సూర్యన్యూస్:** మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. గురువారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అనుభవజ్ఞులై ఉండాలని వారికి అవసరమైన శిక్షణను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొన్ని హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల లోపలనే కాక బయట కూడా వెబ్ కాస్టింగ్ నిర్వహించడంపై ఆలోచించాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన వెంటనే బ్యాలెట్ పేపర్స్‌ను తప్పులు లేకుండా ప్రింటింగ్ చేయించాలన్నారు. కౌంటింగ్ త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైనన్ని ఎక్కువటేబుల్స్ ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పలువురు ఎన్నికల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలోని నాలుగు పురపాలికల్లో మొత్తం 77 వార్డులలో 189 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ సందర్భంగా 430 మంది ప్రిసైడింగ్, 846 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు 1964 మంది ఓపిఓలు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్, ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలతో పాటు కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లన్నీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సుల కొరత లేకుండా అదనంగా బాక్సులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన పోలీస్ బందోబస్తును నియమించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 25 నుండి ఐద్వా అఖిలభారత మహాసభలు



**పాలమూరు సూర్యన్యూస్:** ఈనెల 25 నుండి 28 వరకు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్నాయని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పద్మ అన్నారు. గురువారం ఆ సంఘం సంఘం కార్యాలయం ముందు మహిళా సంఘం, సిఐటియు నాయకులతో కలిసి ఐద్వా జెండా ఆవిష్కరించి, మహాసభల బహిరంగ సభ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమాన హక్కులు,బాల్య వివాహాల నిషేధం, ఆస్తి హక్కు చట్టం, వరకట్నం వేధింపులు, గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు హత్యలపై అనేక సమస్యల పైన నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఐద్వా అన్నారు. మహిళల సమస్యల పరిష్కారం హక్కుల సాధన కోసం జరుగుతున్న అఖిలభారత మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు చంద్రకాంత్, రాజ్ కుమార్, మహిళా సంఘం నాయకురాలు పుష్ప హేమలత, వెంకటమ్మ, లక్ష్మమ్మ, చంద్రకళ, మహిళలు పాల్గొన్నారు.



## ఐదు రోజుల బ్యాంకింగ్ అమలు చేయాలి

### - బ్యాంకు ఉద్యోగుల భారీ నిరసన ప్రదర్శన



**పాలమూరు సూర్య న్యూస్:** ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సిబిఓఏ, ఏఐబి ఓ సి, ఐబీఏ, యుఎఫ్బియు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బ్యాంకు ఉద్యోగులు భారీ ప్రదర్శన చేపట్టారు. నగరంలోని న్యూటౌన్ ఎస్బిఐ బ్రాంచ్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు ప్రదర్శన చేపట్టి వందలాది ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జె. రాజేష్, పి.తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల బ్యాంకింగ్ అమలుపై అసోసియేషన్ నాయకులతో అంగీకారం తెలిపిన ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి అమలు చేయాలని, లేనిచో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్ను పరిష్కరించి ఉద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని, ఆందోళనను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఈ నెల 27న సమ్మెకు వెళ్లనున్నట్టు ప్రకటించారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరేష్ జగన్నాథరెడ్డి వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు, సభ్యులు ఉద్యోగులు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.




# మైనర్లు ద్విచక్ర వాహనం నడిపితే కేసు నమోదు చేస్తాం

### - మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దు - పెబ్బేరు.ఎం.వి.ఐ వాసుదేవరావు





**పెబ్బేరు. సూర్య న్యూస్ :** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పెబ్బేరు మండల కేంద్రంలో గురువారం ఎంవిఐ వాసుదేవరావు, ఎస? యుగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో, వాహనాల డ్రైవర్స్, స్థానిక యువత, పౌరులతో కలిసి గురువారం భారీ రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఆర్టీఏ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కర్నూల్ బైపాస్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఎంవిఐ వాసుదేవరావు, ఎస? యుగేందర్ రెడ్డి ప్రజలకు రోడ్డు భద్రతపై ముఖ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.అలాగే మైనర్లు బైకులు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.ప్రస్తుత సమాజంలో దేశ రక్షణలో కంటే రోడ్డు ప్రమాదాల బారినపడి మృత్యువాత పడేవారే ఎక్కువగా ఉన్నార?న్నారు. ఈ ప్రమాదాలను నివారించడం, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత మహా ఉద్యమం ప్రారంభించడం జరిగింద?న్నారు.ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాల?ని విజ్ఞప్తి చేశారు.అలాగే పెబ్బేరు పట్టణంలోని ప్రవేట్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో , పోలీసులు.. ఆర్టిఏ ఏజెంట్లు. ద్విచక్ర వాహన దారులు. ఆటో వాహనదారులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ



**కోడేరు, సూర్య న్యూస్ :** ఎంఈఓ భాస్కర్ శర్మ గురువారం మండల పరిధిలోని పిఎస్ నర్సాయిపల్లి, పిఎస్ బాడుగదిన్నె, పిఎస్ బాడుగ దిన్నె తాండ పాఠశాలను సందర్శించారు. మూడవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శుద్ధ వహించే ఎఫ్ ఎల్ ఎస్ కార్యక్రమం అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రీ ప్రైమరీ పాఠశాల లో విద్యార్థుల సంఖ్యను పెంచుటకు ప్రయత్నం చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడం జరిగింది. విద్యార్థుల సామర్థ్యాలను పెంచుటకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యచరణ తయారు చేసుకొని అమలు చేయాలని కోరారు. ఎంఈఓ భాస్కర్ శర్మ వెంట కాంప్లెక్స్ సిఆర్పి సాయికుమార్ ఉన్నారు.

## దళారుల చేత రైతులు మోసపోవద్దు

### - మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్ యాదవ్



**కల్వకుర్తి సూర్య న్యూస్ :** దళారుల చేత రైతులు మోసపోవద్దని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్ యాదవ్ తెలిపారు. గురువారం మార్కెట్ యార్డులోని వేరుశనగ, కందులను ప రి శీ లిం చా ర ు. వేరుశనగ గరిష్ట ధర 9863, మోడల్ ధర 9709, కనిష్ట ధర 7501, అదేవిధంగా కందులు 6809, మోడల్ ధర 6709, కనిష్ఠ ధర 6268, ధర పలికింది. 113 మంది రైతులు 1040 క్వింటాల వేరుశనగ, కందులను మార్కెట్ కు తేవడం జరిగిందన్నారు, రైతులు తమ పంటను నాణ్యతగా తేమశాతం లేకుండా ఆరబెట్టుకొని తేవాలని మంచి ధర వస్తుందని సూచించారు, రైతులు తమ పంటను ఎక్కడ విక్రయించరాదని, వ్యవసాయ మార్కెట్ యార్డులోనే విక్రయించాలని మద్దతు ధర దొరుకుతుందని తెలిపారు, తూకాలలో ఎలాంటి మోసాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు, రైతులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## పశుఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా అధికారి



**ఇటిక్యాల సూర్యన్యూస్:** డాక్టర్ శివానంద స్వామి ఎర్రవల్లి మండల పరిధిలోని సబ్ సెంటర్ పుటాన్ దొడ్డి గ్రామంలో ఉన్న ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి రోజువారి చికిత్సలు తెలుసుకోవడం జరిగింది అదేవిధంగా జిల్లా అధికారి స్థానిక సబ్‌సెంటర్ అధికారికి మసుమన్నకి ప్రజలకు అందుబాటులో ఉండాలి అని చూచివారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఆఫీస్ అసిస్టెంట్ రామకృష్ణ ఉన్నారు.

## మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

**తెలకపల్లి సూర్య న్యూస్ :** మండలంలోని గౌ రెడ్డి పల్లి, పెద్దూరు గ్రామాల్లో మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ఫిబ్రవరి 9 లోగా డిగ్రీ సమానమైన కోర్సు యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సంతోష్ తెలిపారు, దరఖాస్తు ఫారాలను తహసిల్దార్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు, అనంతరం రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అర్హులను ఎంపిక చేయనున్నట్టు వివరించారు.

# ప్రభుత్వ సహకారం సంపూర్ణంగా ఉంటుందని హామీ

### - మున్ననూర్‌లో ఆర్‌డిటి ఆసుపత్రిని సందర్శించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ







**పదర. సూర్య న్యూస్ :** అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూర్‌లో ఉన్న ఆర్డిటి రూరల్ డెవలప్మెంట్ ట్రస్టు. ఆసుపత్రిని గురువారం నాడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఆర్‌డిటి విద్యా వైద్యం. ఆరోగ్యం. గృహనిర్మాణం. వ్యవసాయం తదితర అంశాలపై ఎన్నో ఉచిత సేవా కార్యక్రమాలు చేస్తున్నదని ఆర్డిటి స్వచ్ఛంద సంస్థకు తెలంగాణ ప్రభుత్వం సహాయ సహకారాలు సంపూర్ణంగా ఉంటుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాచారం గ్రామంలో గుండెపోటుతో చనిపోయిన ఫారెస్ట్ వాచర్ శ్రీనివాసులు కుటుంబానికి పదివేల చెక్కును అందజేశారు. శ్రీనివాసులు కుటుంబానికి అన్ని రకాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ ఓ రేవంత్ చంద్ర. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ప్రభుత్వపాఠశాలల బలోపేతానికి చర్యలు

### - ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా పర్యవేక్షణ బృందం



**లింగాల, సూర్యన్యూస్:** సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా పాఠశాలలను బలోపేతం చేసే లక్ష్యంతో తనిఖీ బృందాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా పర్యవేక్షణ బృందం సభ్యులు తెలిపారు. గురువారం మండల పరిధిలోని అవుసలి కుంట, దత్తారం,జిలుగుపల్లి ప్రాథమిక పాఠశాలలను జిల్లా స్థాయి పర్యవేక్షణ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, పనితీరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి సదుపాయం, విద్యా సంబంధమైన కార్యక్రమాలను, పలు రికార్డులను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఉపాధ్యాయులు తమ బోధించే విషయాల యొక్క అభ్యాసన సాధన పత్రాలు తప్పనిసరిగా సరిదిద్ది సంతకం చేయాలని సూచించారు. కనీస సామర్థ్యాలు ప్రతి విద్యార్థి సాధించేలా సంకల్పించాలని సూచించారు. పాఠశాలల్లో తమ పరిశీలన నివేదికను జిల్లా విద్యాశాఖ విద్యాశాఖ అధికారికి అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను, ఉపాధ్యాయుల్లో ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలను పరిశీలించడానికి ప్రత్యేక కమిటీలు దోహదపడతాయని ఎంఈఓ బషీర్ అహ్మద్ అన్నారు. జిల్లా పర్యవేక్షణ బృందంలో ఎల్ ఎఫ్ ఎం హెచ?ం పొట్లపల్లి నాగరాజు, భృంగి కృష్ణప్రసాద్,ఎజ్జ ఈశ్వరయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్ గారు ఊరుకోండ జేఏసీ నాయకులు నిరంజన్ గౌడ్. టీ చిన్న. నరేందర్ గౌడ్, జంగయ్య. దివాకర్ గౌడ్. శివ. ఆనంద్ గౌడ్, జంగయ్య, బాలకిష్టయ్య, నారాయణ్ రెడ్డ్య, షబ్బీర్, తిరుపతి రెడ్డి తదితర జేఏసీ నాయకులు ఉన్నారు.

## ధూప దీపం నైవేద్యం ప్రొసిడింగ్ కాపీ అందజేత



**చిన్నచింతకుంట సూర్యన్యూస్:** శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో పూజారి అర్చక శ్రీ వెంకటరంగయ్య గూడూరు గ్రామానికి చెందిన శ్రీ అంజనేయ స్వామి దేవాలయము గూడూరుకి ధూప దీప నైవేద్యం ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీ దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారంగా ఇవ్వడం జరిగింది అట్టి ప్రొసిడింగ్ కాపీని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పి నాగరాజు భారతమ్మ భాస్కరాచార్యులు కమలాకర్ చక్రవర్ధన్ రెడ్డి వన్నాడ గోపాల్ ముఖ్య అర్చకులు వెంకటయ్య అర్చకులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో
పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, భూత్పూర్, కౌకుంట్ల, రాజాపూర్, మూసాపేట, దేవరకద్ర రూరల్
వనపర్తి జిల్లా : వనపర్తి రూరల్, పాన్‌గల్, ఖిల్లఘణపురం
నాగర్‌కర్నూల్ జిల్లా : అచ్చంపేట టౌన్, అచ్చంపేట రూరల్, బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, తాడూరు, తిమ్మాజిపేట,
జోగులాంబగద్వాల జిల్లా : ఎర్రవల్లి, వడ్డేపల్లి, మానోపాడు

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757